వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలతో పాటు ఎంఫిల్ రిహాబిలిటేషన్ సైకాలజీ పార్ట్ 2 రెగ్యులర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

నేటి నుంచి మహా శివరాత్రి మహోత్సవాలు

కవాడిగూడ, ఫిబ్రవరి 24: భోలక పూర్ దేవునితోటలోని చారిత్రక భవానీ శంకర దేవాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారిని జ్యోతి తెలిపారు. మహోత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటల నుంచి గణపతి పూజ, అఖండ దీపారాధన, పూజలు నిర్వహిస్తారని అన్నారు. మహోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించినట్లు తెలిపారు. ఈ శివరాత్రి మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

ముమ్మరంగా ఏర్పాట్లు..

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 : నగరంలో ప్రసిద్ధిగాంచిన ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో బుధవారం భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయం పునరుద్ధరణ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, కార్యనిర్వాహణ అధికారి లక్ష్మారెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ .. శివాలయంలో శివరాత్రి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచి పూజలు ప్రారంభం అవుతాయని తెలిపారు.

వసతులు ఉంటేనే చదువుపై శ్రద్ధ చూపుతారు..

- పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి..
- సనత్‌నగర్ రౌండ్ టేబుల్ పాఠశాల సందర్శనలో ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్‌లోని రౌండ్ టేబుల్ పాఠశాలను సందర్శించి.. మౌలిక వసతులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అమీర్‌పేట, ఫిబ్రవరి 24: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, అవి సరిగ్గా లేకపోతే విద్యార్థులు చదువులపై శ్రద్ధ చూపలేరని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి, బాలానగర్ మండల విద్యాధికారి హరిచంద్రతో కలిసి ఆయన సనత్‌నగర్‌లోని రౌండ్ టేబుల్ పాఠశాలను సందర్శించారు. ఇక్కడి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య దాదాపుగా 600గా ఉందని, అయితే ఇక్కడి తరగతి గదులు పరిమిత సంఖ్యలో ఉండడంతో పాఠశాల ఆవరణలోని చెట్ల కింద, ఇతర అవసరాల కోసం ఏర్పాటుచేసిన షెడ్ల కింద తరగతి గదులు కొనసాగే పరిస్థితులు ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఇక్కడికి సమీపంలో ఖాళీగా ఉన్న పాత ఈఎస్ఐ డిస్పెన్సరీగా కొనసాగిన భవనాన్ని పరిశీలించారు. ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకొని, రౌండ్ టేబుల్ పాఠశాల కోసం భవనాన్ని నిర్మించి ఇవ్వాలని మేడ్చల్ కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫోన్ ద్వారా సూచించారు. దీంతో విద్యార్థులకు తరగతి గదుల కొరత కొంతవరకైనా తీరుతుందని పేర్కొన్నారు.

మైదానాన్ని వినియోగించుకోవాలి..

సనత్‌నగర్ ఎస్ఆర్‌టీలో కొనసాగుతున్న డిస్పెన్సరీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు గత బీఆర్ఎస్ సర్కార్ రూ.1.43 కోట్ల నిధులను మంజూరు చేసిందని ఎమ్మెల్యే తలసాని పేర్కొన్నారు. ఈ డిస్పెన్సరీకి పేద బడుగులు అధిక సంఖ్యలో వైద్య అవసరాల నిమిత్తం వస్తుంటారని, అరకొర వసతులతో ఉన్న ఈ డిస్పెన్సరీని మరింతగా అభివృద్ధి చేసేందుకు, పక్కనే ఉన్న జీహెచ్ఎంసీ పార్కులోకి విస్తరించాలని గతంలో ప్రతిపాదనలు చేసి తగిన నిధులను కూడా మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మారిన పరిస్థితుల్లో ఈ ప్రతిపాదనలు అటకెక్కాయన్నారు. ఇప్పటికైనా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుంటే సనత్‌నగర్ ప్రజలకు చక్కటి ఆసుపత్రి అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌కులను లక్ష్మిరెడ్డితో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట, ఫిబ్రవరి 24 : ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం రాంగోపాల్‌పేట డివిజన్, కుర్మబస్తీలో మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రింటర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ.. పేదలు అధికంగా నివసించే బస్తీల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం ప్రింటర్స్ డే సందర్భంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్న మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మక్తాల జలంధర్ గౌడ్, ఇతర సభ్యులను ఆయన అభినందించారు. ఈ శిబిరంలో దాదాపు 200 మందికి పైగా వైద్యపరీక్షలు చేయించుకోగా, అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహంకాళి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పరశురాం, మాజీ కార్పొరేటర్లు అత్తిలి మల్లికార్జున్ గౌడ్, అత్తిలి అరుణాగౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కిశోర్ కుమార్, నాగులు, పబ్బా ప్రకాశ్, చంద్రప్రకాశ్, వైద్యులు గౌతం, రాకేశ్‌గౌడ్, మీనల్ చంద్ర, సునీల్, రేయన్, రాజశేఖర్, సుచరిత, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శేఖర్‌గౌడ్, సభ్యులు ప్రసన్న, హరి కుమార్, శ్రవణ్, మహేశ్, శివకుమార్, వేణు, పూర్ణ చందర్, అభిలాష, సుబ్బు, బస్తీవాసులు దౌల్తాబాద్ రాజేందర్, మల్లికార్జున్, హర్షిత్, శౌర్యానంద్, భానుచందర్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు రుణాలు మాఫీ చేయాలి

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి 24: రాష్ట్రంలోని చేనేత కార్మికులకు అన్ని రకాల రుణాలను మాఫీ చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జియోట్యాగ్ లేని మగ్గాలన్నింటికీ జియోట్యాగ్ వేసి, చేనేత కార్మికులకు నేతన్న పొదుపు పథకం (త్రిఫ్ట్) వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. చేనేత అభయ హస్తంను అమలును వేగవంతం చేసి అర్హులైన కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి సహకార వ్యవస్థను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. చేనేత రంగానికి ఐదువేల కోట్ల నిధులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

28 నుంచి అంతర్జాతీయ మహిళా సదస్సు

సమావేశంలో మహిళలు..

అమీర్‌పేట, ఫిబ్రవరి 24 : మహిళా వ్యాపారులకు కొత్త అవకాశాలు అందించడమే లక్ష్యంగా కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (సీఓడబ్ల్యూఈ) ఆధ్వర్యంలో ఉమెన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంట్రప్రెన్యూర్షిప్ (డబ్ల్యూఐఎస్ఈ), బీ2బీ ఎక్స్‌పో 2025.. ఫిబ్రవరి 28 నుంచి రెండు రోజులపాటు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో నిర్వహించనున్నట్లు కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ జాతీయ అధ్యక్షురాలు లలితా ఆలూరి తెలిపారు. సోమవారం బేగంపేట్‌లోని హోటల్ ప్లాజాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ..ఈ సదస్సును తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖలు హాజరు కానున్నారని చెప్పారు. ఇది మహిళా పారిశ్రామికవేత్తలకు నెట్‌వర్కింగ్, సహకారానికి ఒక వేదికను అందిస్తుందన్నారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు పరిశ్రమ నిపుణులు, విధాన నిర్ణయాధికారులు, అంతర్జాతీయ వాణిజ్య ప్రతినిధులు, మహిళా వ్యాపారవేత్తలు హాజరుకానున్నారని తెలిపారు.

ఈ సదస్సు ప్రధానంగా వివిధ రంగాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించడం, స్థిరమైన వ్యాపార వృద్ధికి దోహదపడటాన్ని లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఈ ఈవెంట్ ముగింపు సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు మేయర్ విజయలక్ష్మి గద్వాల్, తదితరులు హాజరుకానున్నారు.



ఉన్నికోట కమ్యూనిటీహాల్ ప్రారంభంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జయసింహ, తదితరులు

ఆరు నెలల్లో పూర్తి చేయండి..

కమ్యూనిటీహాల్ పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, ఫిబ్రవరి 24: ప్రజల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. కవాడిగూడ డివిజన్ పరిధిలోని ఉన్నికోటలో రూ.1.10కోట్లతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటీహాల్ స్లాబ్ నిర్మాణ పనులను సోమవారం యువనాయకుడు ముఠా జయసింహతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నికోటలో దాదాపు 5 వందల కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ఏ చిన్న శుభకార్యం జరుపుకోవాలన్నా బయటకు వెళ్లాల్సి వస్తుందని, ఫంక్షన్ హాల్స్‌లో చేసుకోవాలంటే రెక్కాడితే కాని డొక్కాడని పేదలకు భారం అవుతుందని.. అందుకే ఇక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఇది పూర్తి అయితే ఉన్నచోట శుభకార్యాలు జరుపుకోవడానికి అనువుగా ఉంటుందని చెప్పారు. గ్రౌండ్ ప్లస్ వన్‌గా నిర్మాణం చేపడుతున్న కమ్యూనిటీ హాల్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి ఆరు నెలల్లో పూర్తిచేసి బస్తీ వాసులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా బస్తీ వాసులందరూ కమ్యూనిటీ హాల్‌ను కాపాడుకోవాలని, శుభకార్యాల కోసం వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వల్లాల శ్యాంయాదవ్, నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, చిత్రాలనగర్ శ్రీహరి, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, మాధవి, రూప, మంజుల, శ్రీనివాస్ గుప్తా, వల్లాల రవి యాదవ్, రాజు యాదవ్, రాజేశ్, నర్సింగ్, సురేశ్, శివ, వెంకటేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనీ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 : గాంధీనగర్ డివిజన్ పరిధిలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ పావనీ వినయ్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం తన కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని పలు బస్తీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు . ఈ సమావేశంలో ఇంజినీరింగ్ డిప్యూటీ ఇంజినీర్ గీత, అసిస్టెంట్ ఇంజినీర్ అబ్దుల్ సలాం, నాయకుడు వినయ్‌కుమార్, ఇంజినీరింగ్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం.. మందులు పంపిణీ

ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బొల్లారం, ఫిబ్రవరి 24: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడం అభినందనీయమని హుడా (రిటైర్డ్ ఐపీఎస్) అన్నారు. కంటోన్మెంట్ రెండో వార్డు కమ్యూనిటీ హాల్ వద్ద లీ ఫార్మా, క్రియా సంఘ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 1400 మందికి పరీక్షలు నిర్వహించి..ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లీ ఫార్మా ఎండీ వీఆర్ఏఎన్ కట్రేడ్డి అల్లా, సీనియర్ డాక్టర్లు సీఎల్ వెంకట్రావు, రాజీవ్ అరబ్, క్రియా సంఘ్ సంస్థ వ్యవస్థాపకులు షేక్ నయీమ్, హుస్సేన్, శ్రీధర్, జబర్ అలీ, కాంక లక్ష్మి, జుబైర్, తదితరులు పాల్గొన్నారు

వంగపల్లి శ్రీనివాస్ కు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ : సోషియాలజీ విభాగంలో వంగపల్లి శ్రీనివాస్ డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ సునంద పాండే పర్యవేక్షణలో సోషల్ మొబిలిటీ ఆఫ్ ఫిషింగ్ కమ్యూనిటీస్: ఏ సోషియోలాజికల్ స్టడీ ఆన్ ట్రెడిషనల్ ఫిషరీస్ ఇన్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి శ్రీనివాస్ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలిం చిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. యాదాద్రి-భువనగిరి జిల్లా మోటకొండూరుకు చెందిన ఆయన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సెంటర్ ఫర్ ఎకానమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) లో సహాయ పరిశోధకుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

జవహర్‌నగర్, ఫిబ్రవరి 24: కౌకూర్ ప్రాంతంలో గుర్తు తెలియని రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాయి. ఎస్‌హెచ్‌వో సైదయ్య కథనం ప్రకారం... యాప్రాల్ పరిధిలోని కౌకూర్ ప్రాంతంలో ఈనెల 22న మసీద్ గోడ పక్కన ఓ మహిళ అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. ఆమెను పరిశీలించిన చూడగా అప్పటికే మరణించినట్లు కనిపించిందని, సుమారు 75ఏళ్ళ వయస్సు ఉంటుందని తెలిపారు. మరో ఘటనలో కౌకూర్‌లోని వ్యవసాయ పొలాల్లో ఓ వ్యక్తి మృతదేహాన్ని పరిశీలించిన స్థానికులు అతని పరిశీలించగా అప్పటికే కుళ్ళిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులకు మృతదేహాలను పరిశీలించారు. సుమారు 60ఏళ్ళ వయస్సు ఉంటుందని, మృతుడు భిక్షాటన చేసే వ్యక్తిలా కనిపిస్తుండని చెప్పారు. ఈ మేర కు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్క్రాప్ గోదాములో అగ్నిప్రమాదం

మేడ్చల్ రూరల్, ఫిబ్రవరి 24: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని స్క్రాప్ గోదాములో మంటలు చెలరేగి పాత ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. మున్సిపల్ పరిధిలోన అప్పరల్ పార్కు వద్ద ఉన్న ఓ గోదాంను నాలుగు నెలల క్రితం లీజుకు తీసుకొని అందులో పాత ప్లాస్టిక్ వస్తువులను నిల్వ ఉంచారు. సోమవారం అకస్మాత్తుగా గోదాములో మంటలు అంటుకొని ఎగిసిపడ్డాయి. ప్లాస్టిక్ వస్తువులు కావడంతో చూస్తుండగానే గోదాం మొత్తం మంటలు వ్యాపించాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు అంటుకున్న సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 24 : టీఎస్ ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ బర్కత్‌పుర బస్‌డిపో, కాచిగూడ రైల్వే స్టేషన్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అజాంబాద్ డివిజన్ ఏడీఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు బర్కత్‌పుర బస్‌డిపో, కాచిగూడ రైల్వే స్టేషన్ ఫీడర్ పరిధిలోని అమృత వర్షిని అపార్ట్‌మెంట్, రాజేంద్రనగర్ కాలనీ, కాచిగూడ రైల్వే స్టేషన్ కాంప్లెక్స్, కాచిగూడ రైల్వే స్టేషన్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

గ్యార్వీ ఉత్సవాలు ..

బన్సీలాల్‌పేట, ఫిబ్రవరి 24 : బన్సీలాల్‌పేటలోని చిల్లా వద్ద గ్యార్వీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు స్థానిక కార్పొరేటర్ హేమలత, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య నిర్వాహకుడు అష్జల్ సాహెబ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, షేక్‌జావిద్, అన్వర్‌పాషా, ఫాజిల్, ముజీబ్, సోహైల్, జహంగీర్, మహమ్మద్ అలీ , తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట, ఫిబ్రవరి 24 : ఆర్థిక సమస్యలు, అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. సీఐ అనుదీప్ వివరాల ప్రకారం ... సీతాఫల్‌మండి ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన నర్సింగ్‌రావు అలియాస్ రాజు(52) ఇండియన్ పవర్ గ్రిడ్ లిమిటెడ్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే.. కొంతకాలంగా నరసింగ్‌రావు ఆర్థిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. సమస్యలు తాళలేక పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి కూడా ప్రయత్నించారు. సోమవారం ఉదయం బాత్రూంలోకి వెళ్లిన నర్సింగ్‌రావు బయటికి రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బాత్రూం డోరు తెరిచి చూడగా రక్తపు మడుగులో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా బ్లేడుతో గొంతు కోసుకొని మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులకు డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలి

సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు దశరథ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 : ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యుడు దశరథ్ డిమాండ్ చేశారు. సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో దరఖాస్తుదారులతో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో సుమారు 40,000వేల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వీరందరికీ మిగిలిపోయి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని, సొంత జాగలు ఉన్న వారికి రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సొంత స్థలాలు లేనివారికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించి.. నిర్మాణానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేస్తే హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని అన్ని బస్తీల్లో ఇందిరమ్మ ఇళ్ల సాధన కోసం కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, లబ్ధిదారులందరూ ఇండ్లు సాధించేంతవరకు ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో సీపీఎం ముషీరాబాద్ నియోజకవర్గ కార్యదర్శి వెంకటేశ్, జోన్ కార్యదర్శివర్గ సభ్యులు రమేశ్, నాయకులు విజయ్‌కుమార్, ముషీరాబాద్ జోన్ కమిటీ సభ్యురాలు వెంకటమ్మ, నాయకులు మల్లయ్య, నారాయణమ్మ, రమణమ్మ, రాజు, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

మౌనిక(ఫైల్)

జవహర్‌నగర్, ఫిబ్రవరి 24: గృహిణి అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ సైదయ్య కథనం ప్రకారం... కార్పొరేషన్ పరిధి బాలాజీనగర్ సేవాలాల్‌తండాలో జాటోతి మౌనిక, భర్త ఉపేందర్‌తో కలిసి నివసిస్తున్నారు. కొంత కాలంగా మౌనిక, ఉపేందర్‌ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇటీవల భర్త ఉపేందర్ తన సొంతగ్రామమైన తుంగతుర్తికి వెళ్ళిపోయాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న రూ. 26వేలు తీసుకుని మౌనిక ఈనెల 24న ఇంట్లో చెప్పకుండా వెళ్ళిపోయింది. మౌనిక తల్లి సైదమ్మ ఆమె ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. కుటుంబసభ్యులు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఘనంగా నిఫిడ్ 41వ వార్షికోత్సవం

వేడుకలను ప్రారంభిస్తున్న బీడీఎల్ మేనేజర్ సత్యనారాయణన్, డాక్టర్ మీనాక్షి, డైరెక్టర్ రామ్‌కుమార్

బొల్లారం, ఫిబ్రవరి 24: మేధో వైకల్యాలు కలిగిన వ్యక్తుల ప్రతిభతోపాటు వారి విజయాలను ప్రదర్శించడానికి నిఫిడ్ కేంద్రం ఒక వేదికగా పనిచేస్తుందని నిఫిడ్ డైరెక్టర్ బీవీ రామ్‌కుమార్ అన్నారు. బోయిన్‌పల్లిలోని ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజాబిలిటీస్ (నిఫిడ్) లో సోమవారం 41వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీడీఎల్ సంస్థ మేనేజర్ సత్యనారాయణన్, డాక్టర్ మీనాక్షి (ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్) లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీడీఎల్ మేనేజర్ సత్యనారాయణన్ మాట్లాడుతూ.. మేధోపరమైన వైకల్యం ఉన్న వ్యక్తులను శక్తివంతం చేసి, వారిలోని నిబద్ధతను బలపరిచేందుకు నిఫిడ్ కేంద్రం సమాజంలో సమగ్రమైన పాత్రను పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు బీడీఎల్, సీఎస్ఆర్ ఫండ్ ద్వారా విరాళంగా అందించిన ఆధునిక టెక్నాలజీ సమాచార సామగ్రితో పాటు యంత్రాలను ప్రారంభించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడల్ట్ ఇండిపెండెంట్ లివింగ్ (డయల్)లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగ పత్రాలను అందజేశారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కళా నృత్యాలతో పాటు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. నిఫిడ్ అధికారులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిద